అని, అంతవరకూ తను పత్రికలకు వుత్తరాలు వ్రాస్తానని చెప్పర పోవడం తప్పయిందనుకుంటూ తన వుత్తరాలు పడినసదరు పత్రికలన్నీ చూపించి రోజూ ఏ పత్రికకు వుత్తరంవ్రాసానో డైరీలో రాసుకుంటానని చెప్పాడు.

"డియర్ అవన్నీ నేను ఉత్తరాలు వ్రాసిన పత్రికల పేర్లు అంతే కాని అమ్మాయిల పేర్లు కావు అయినా ఈ అప్సరస వుండగా నాకు మరో అమ్మాయి ఎందుకు?

అంటూ వాణిని అక్కున చేర్చుకున్నాడు.

"నన్ను క్షమించరూ" అంటున్న వాణితో "మైడియర్ త్వరలో అఖిలభారత స్థాయిలో ఉత్తరశ్రీ అని బిరుదు ఇవ్వబోతున్నారోయ్" అన్నాడు.

వాణి, ప్రవీణ కౌగిల్లో కరిగి పోతుంది ఇవేమీ ఆమెకు వినిపించ లేదు.

—o—

# దుమ్ము

బుల్‌డోజర్ శబ్దం చేసుకుంటూ ఆర్. టి. సి. బస్ వచ్చి ఆ చిన్న ఊరి బస్ స్టేజీలో ఆగింది.

ఆ రోజు మంచిరోజు, పెళ్ళిళ్ళ సీజన్ కాబట్టి జనం బాగాఉన్నారు. బస్సులో పరిస్థితి అలాగేవుంది. సీట్లన్నీ నిండిపోగా నలుగురయిదుగురు నిలబడి ఉన్నారు. దిగాల్సినవాళ్ళు పదిమంది దిగారు.

"దయచేసి పదిమందిమాత్రమే ఎక్కండి సార్" అన్నాడు కండక్టర్. అంతే అక్కడ ఉన్న జనసమూహం లింగభేదం లేకుండా ఒకరి మీద ఒకరు పడి తోసుకుంటూ బస్సునిండా ఎక్కేసారు. చివర్ని రెండు వైపులా కిటికీ ఊసలు పట్టుకుని నలుగురు వ్రేలాడుతున్నారు. వాళ్ళకు కాళ్ళు పెట్టుకోడానికి స్థలంలేదు. పరిస్థితి ఇలా తయారయ్యేప్పటికి అధ్యక్ష పాలన ఉన్నచోట ఎన్నికలు పెట్టమంటే అధ్యక్షుడికి ఎంతకోపంవస్తుందో కండక్టర్‌కి అంతకోపం వచ్చింది.

"సార్, పదిమంది మినహా మిగతావాళ్ళు దిగితే కాని బస్ కద లదు."

"ఏం, పదిమందిని ఎక్కించుకున్నప్పుడు మిగతావాళ్ళు నీకు బరు వయ్యారా" ఒక రామారావు.

"ఏం ఇది నీ సొంతబస్సా" మరో రామారావు.

"బాబూ పెళ్ళికి వెళ్ళాలి. ప్రొద్దుటినుండి బస్సులులేవు మావి పది టిక్కెట్లు, మా కుటుంబం వెళ్ళిపోతాం నీ పుణ్యాన్ని" అని ఒక కుటుంబరావు.

కండక్టర్ కోపం తారాస్థాయికి అందుకుంది. క్లాసులో తన పాఠం వినకుండా అల్లరిచేస్తున్న పిల్లలను నిస్సహాయంగా చూస్తున్న మేష్టారిలా వుంది అతని పని.

"మీరందరూ దిగకపోతే ఈ బస్సు కదలదండి. ఇక్కడ ఎక్కిన వాళ్ళందరూ దిగాలి. తరువాత మీ ఇష్టం" అన్నాడు.

బస్సులో కూర్చున్న ప్రయాణీకులు నిలబడ్డవార్ని ఉద్దేశించి "మీరంతా దిగండి మాకు ఆలస్యమైపోతూంది" అంటున్నారు.

దానితో మొదలయింది పోరాటం.

"బస్సులో హాయిగా సీట్లు దొరికితే మేమూ ఇలాగే మాట్లాడతాం" అన్నారు.

కొంతమంది కండక్టర్‌ని సమర్ధిస్తున్నారు. మరికొంతమంది తమ శక్తికొద్దీ తిడుతున్నారు. ఇంకా కొంతమంది రాష్ట్ర, దేశ, ప్రపంచ రాజ కీయాలు హాయిగా మాట్లాడుకుంటున్నారు. ఒక మూలగా క్రొత్తగా పెళ్ళ యిన దంపతులు ఒకళ్ళ నొకళ్ళు తనివితీరా చూసుకుంటున్నారు. చివరకు సరెండర్ అయిన వ్యక్తిలా కండక్టర్.

"బ్రదర్ బస్ పోనియ్. జనం దిగటంలేదు ఏం చేద్దాం." అని గట్టిగా చేతిలోవున్న పంచ్‌మిషన్‌తో శబ్దం చేశాడు.

డుర్-డుర్-

డుగ్-డగ్ అని ఆగిపోయింది బస్సు. వెంటనే డ్రైవర్ "బ్రదర్ బస్ కదలటంలేదు. పాసెంజర్లని దిగి తొయ్యమను" అన్నాడో లేదో బస్సులో నిలబడ్డవాళ్ళు "మాకేం పట్టింది మమ్మల్ని తీసుకెళ్ళనంటున్నాడు కండక్టర్ మేమెందుకు తోస్తాం?" అన్నారు. దానితో రాజీ పథకం తయారయింది.

"బస్సు తొయ్యండి-అందర్నీ తీసుకువెళతాం" అన్నారు. మళ్ళీ అందరూ పోటిపడి దిగి, బస్సు తొయ్యసాగేరు. ఒక వందగజాలు తోసేక చైత్రరథం కదిలింది, ఇక ఆగితే వొట్టు. టాప్‌గేర్‌లో వెళ్ళిపోయింది బస్సు.

"మమ్మల్ని ఎక్కించుకోకుండా వెళ్ళిపోతున్నాడేమిటి ?" అని చూస్తున్న ప్రయాణీకులకు కళ్ళలో మట్టిపడి కళ్ళు నులుముకుంటున్నారు వాళ్ళు మరో బస్సుకోసం ఎదురుచూస్తున్నారు. ఎప్పుడు వస్తుందో ?

—o—

# షష్ఠి విభక్తి

వేసవికాలం ప్రవేశిస్తుంది. పిల్లలకి పెద్ద పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి. తెలుగుమాస్టారు అవధానిగారు పిల్లలచేత బాగా చదివిస్తున్నారు.

సమయం రాత్రి తొమ్మిదయింది. పిల్లలందరూ రాత్రి పదింటి వరకూ మాస్టారింట్లోనే చదువుకోడం, అక్కడే పడుకోడం, తెల్లారు జామున నాలుగున్నరకు మాస్టారు బెత్తంతో నిద్రలేపి ఉదయం ఆరు గంటలవరకూ చదివించి ఇంటికి తోలేయడం ఇదీ దినచర్య.

పిల్లలతో పాటుగా ఇంటి వరండాలో రెండు మంచాల మీద తనూ, భార్యా, పిల్లలూ, ప్రయివేటు పిల్లలతోనూ పడుకుంటారు.

సమయం తొమ్మిదిన్నర అయింది.

అవధానిగారి నోట్లో వక్కపొడి నిరంతరంగా పిండిమరలో ఏదో ఒక ధాన్యం నలిగినట్లు నలగాల్సిందే. దీనికి తోడు ఆయనకు మూడ్ వచ్చి